క్లుప్తంగా

విద్యార్థులకు భోజనం ప్లేట్ల పంపిణీ



జి.కొండూరు: మండల పరిధి వెలగలేరు చను మోలు పకీర్రాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 330 మంది విద్యార్థులకు సర్వ దేవ పరమజ్యోతి మానవ సేవా సమితి విజ యవాడ వారి ఆధ్వర్యంలో భోజనం ప్లేట్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ ప్రతాప పుల్లయ్య, ఎన్హెచ్ఏఐ అధికారి రజనీ, పాఠశాల హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు



తిరువూరు: 18 సంవత్సరాలు నిండని మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తిరువూరు సెక్టార్-1 ఎస్ఐ సత్య నారాయణ అన్నారు. పట్టణంలోని పలు కూడళ్లలో శనివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మైనర్లకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం నేరమని, పిల్లలకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు కూడా శిక్షార్హులేనని ఎస్ఐ చెప్పారు. సెక్టార్-2 ఎస్ఐ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడిక తీత



నూజివీడు: పట్టణంలోని అంతర్గత రహదారుల్లో ఉన్న డ్రెయినేజీల్లో పూడికను మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది శనివారం తొలగించారు. వర్షాకాలం కావడంతో మురుగునీరు నిల్వ ఉండి దోమలు పెరిగి ప్రజలకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉండటంతో మున్సిపల్ చైర్పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు పర్యవేక్షణలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. దీనిలో భాగంగా డ్రెయినేజీల్లోని చెత్తచెదారం, తాగి పడేసిన కొబ్బరి బొండాలను, ప్లాస్టిక్ గ్లాసులను, పాలిథిన్ కవర్లు తదితర వాటిని తొలగించి మురుగునీరు ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



తిరువూరు: మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు విత్తన దుకాణాల్లో అనుమతి పత్రాలు లేకుండా విక్రయిస్తున్న రూ.50,976 విలువైన 28 కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు విక్రయించే విత్తనాలకు అనుమతి పత్రాలు తప్పక ఉండాలని, స్టాకు బోర్డు, ధరల పట్టిక ప్రతి దుకాణం వద్ద ప్రదర్శించాలని విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. విత్తనాలు అమ్మినపుడు రైతులకు బిల్లు ఇవ్వాలని, నకిలీ ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు కెనడీ, పద్మ, వెంకటేశ్వర్లు, బాబ్జీ, బాలచంద్రరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెంలో శనివారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ఇటీవల గ్రామంలో విష జ్వరాలు ప్రబలడంతో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించడంతో జేసీబీతో గ్రామంలో చెత్తకుప్పలను తొలగించి, డ్రెయిన్లలో పూడికతీత, పైపులైన్ లీకేజీల మరమ్మతు పనులు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

రెడ్డిగూడెం: ఎస్టీయూ రెడ్డిగూడెం మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎస్టీయూ ఎన్టీఆర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి జి. అనుగ్రహ ప్రసాద్, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్కుమార్, ఎస్కే హబీబుల్లా, జిల్లా కార్యదర్శి పి. రవి పాల్గొన్నారు.

దళితుల ఆశాజ్యోతి జగ్జీవన్రామ్

- పలు ప్రాంతాల్లో వర్ధంతి కార్యక్రమాలు
- విగ్రహాలు, చిత్రపటాల వద్ద నాయకుల నివాళి



మైలవరంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మైలవరం: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయం కోసం శ్రమించిన గొప్ప సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమర యోధులు, దళితుల ఆశాజ్యోతి భారత దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్రామ్ అని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. దివంగత జగ్జీవన్రామ్ వర్ధంతి కార్యక్రమం శనివారం మైలవరం మండల పరిషత్ కార్యాలయం రోడ్డులో నిర్వహించారు. జగ్జీవన్రామ్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతిరావు మాట్లాడుతూ హక్కుల కోసం భిక్షమెత్తకండి, పోరాడి సాధించుకోవాలనే నినాదాన్ని సమాజానికి అందించిన గొప్ప పోరాట యోధుడు జగ్జీవన్రామ్ అని అన్నారు. భారత దేశ ఉప ప్రధానిగా దళిత, బహుజనుల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. విశ్రాంత బీసీ సంక్షేమ శాఖ అధికారి చాట్ల వీరాస్వామి ఆధ్వర్యంలో దళిత నాయకులు డాక్టర్ జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు. మైలవరం టీడీపీ కార్యాలయంలో డాక్టర్ జగ్జీవన్రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్రామ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం రోడ్డులోని డాక్టర్ జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘన నివాళి..

పెనుగొలను/తోటమూల(గంపలగూడెం): జగ్జీవన్రామ్ వర్ధంతిని మండలంలోని పలు గ్రామాల్లో వివిధ రాజకీయ పక్షాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జగ్జీవన్రామ్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ జగ్జీవన్రామ్ సేవలను కొనియాడారు. తోటమూల వై-జంక్షన్లో జగ్జీవన్రామ్ విగ్రహానికి మాజీ ఎంపీపీ కోట దాసు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రమంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలను వివరించారు.

దళితుల జీవనాడి..

నూజివీడు: దళితుల అభ్యున్నతికి అహర్నిశలూ కృషి చేసిన గొప్ప నాయకుడు జగ్జీవన్రామ్ అని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు అన్నారు. జగ్జీవన్రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక అజరయ్యపేటలోని జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అణగారిన కులాల జీవనాడిగా ఉండి వారి అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్రామ్ అని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాదిగల సమైఖ్య అధ్యక్షుడు కంచర్ల లవకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు క్లోపల్లి ఆదినారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు లాం ప్రసాదరావు, నాయకులు కంభాల రాంబాబు, పి. భుజంగరావు, ఉదయగిరి కృపారావు, ముల్లంగి జమలయ్య, పి. ధనరావు, కె. రాజు, కె. మరియదాసు, జి. శేఖర్, బి. వెంకటేశ్వరరావు, రాజ్కమల్, ప్రొద్దుటూరు కమల్, కలపాల ఆది, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.



మైలవరంలో నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



అజరయ్యపేటలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- విస్సన్నపేట: స్థానిక అంబేడ్కర్ సెంటర్లో జగ్జీవన్రామ్ విగ్రహానికి కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల జ్ఞానరత్నం పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు, రైతు సంఘం మండల నాయకుడు జి. రామకృష్ణ, బాణావతు రాము, బాలకృష్ణ, చంటి పాల్గొన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు లాం కొండలరావు ఆధ్వర్యంలో జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. బీజేపీ రాష్ట్ర జోనల్ ఇన్చార్జ్ తేనేటి ఇమ్మానియేలు, పులపాక బాబు, పెనుగొండ రామచంద్రరావు, కందుకూరి మోహన్, తోకల సుమ, సూరిబాబు పాల్గొన్నారు.



సూరేపల్లిలో నివాళులర్పిస్తున్న హన్నా తదితరులు

జగ్జీవన్రామ్ స్ఫూర్తితో పేదరికాన్ని నిర్మూలిద్దాం

ముసునూరు: జగ్జీవన్రామ్ మహాశయుని స్ఫూర్తితో భూమి లేని నిరుపేదలను ఆదుకునేందుకు కృషి చేయాలని సాధన ల్యాండ్ లెస్ పూర్ పీపుల్స్ సంఘ కార్యదర్శి కంకట హన్నా అన్నారు. సూరేపల్లి సెంటర్లోని జగ్జీవన్రామ్ చిత్రపటానికి సంఘ సభ్యులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ ప్రతినిధులు, స్థానిక జగ్జీవన్రామ్ యూత్, ఎంఆర్పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని విజయలక్ష్మికి సన్మానం



విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

మైలవరం: జాతీయ స్థాయిలో ఇటీవల ముంబైలో జరిగిన వర్డ్ పవర్ చాంపియన్షిప్ పోటీల్లో కనిమెర్ల పాఠశాల ఉపాధ్యాయిని విజయలక్ష్మి ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా మైలవరం ఎంఈఓ కార్యాలయంలో ఎంపీపీ ప్రసన్నరాణి ఆధ్వర్యంలో శనివారం విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ వర్డ్ పవర్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి మైలవరం మండలానికి విజయలక్ష్మి మంచి పేరు తెచ్చారని అభినందించారు. నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో కనిమెర్ల, దాసుళ్లపాలెం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పీవీ నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలుష్యం నివారణకు మొక్కలు నాటాలి



జూపూడి(ఇబ్రహీంపట్నం): పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని నిమ్రా కళాశాలల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి అన్నారు. జూపూడి నిమ్రా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా స్థానిక ఇందిరమ్మ కాలనీలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యం నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని సూచించారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్ ఖాన్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడులో సీఎన్జీ బంకును ఏర్పాటు చేయాలి



నూజివీడు: పట్టణంలో సీఎన్జీ బంకును ఏర్పాటు చేయాలని సీఎన్జీ ఆటో డ్రైవర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆటో డ్రైవర్లు శనివారం మేఘా గ్యాస్ కంపెనీ మేనేజర్కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నూజివీడులో సీఎన్జీ ఆటోలు 800 వరకు ఉన్నాయని, సీఎన్జీతో నడిచే కార్లు సైతం ఉన్నాయని చెప్పారు. ఈ వాహనాలన్నీ సీఎన్జీ కావాలంటే ఆగిరిపల్లి వెళ్లాల్సి వస్తోందని, రామన్నగూడెం రోడ్డులోని బంకులో ఏర్పాటు చేసినప్పటికీ అది తరచూ మరమ్మతులకు గురవుతోందన్నారు. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నూజివీడులో సీఎన్జీ బంకును ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని కోరారు.

శ్యామ్ప్రసాద్ ముఖర్జీకి నివాళి



ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం ఇబ్రహీంపట్నంలో శనివారం జరిగింది. ఆయన చిత్రపటానికి కూటమి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కశ్మీర్లో 370 ఆర్టికల్ రద్దు చేయాలని కేంద్రంతో పోరాడి తన మంత్రి పదవికి శ్యామ్ప్రసాద్ ముఖర్జీ రాజీనామా చేశాడని వక్తలు కొనియాడారు. కశ్మీర్ వరకు పాదయాత్ర చేసి తన ప్రాణాలు సైతం లెక్కచేయలేదని అన్నారు. నాయకులు మారాసు కృష్ణ మోహన్, చిగురుపాటి శ్రీలక్ష్మీ, తుమ్మల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ప్రసాద్ ముఖర్జీకి నివాళి

గంపలగూడెం: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం గంపలగూడెంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జమ్ముకశ్మీర్ను పూర్తిగా భారత్లో విలీనం చేయాలని, 370 ఆర్టికల్ రద్దు చేయాలని శ్యామ్ప్రసాద్ ముఖర్జీ రాజీలేని పోరాటం సాగించారన్నారు. పార్టీ నాయకులు కె. నాగగోపాల్కృష్ణ, వనమా సుజాత, కొడుమూరి సూర్యప్రకాశరావు, అంకుశరావు, ఎ. క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

తిరువూరు: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని తిరువూరు బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జమ్ము కశ్మీర్ను పూర్తిగా భారత్లో విలీనం చేయాలని, 370 ఆర్టికల్ రద్దు చేయాలని కశ్మీర్కు పాదయాత్ర చేసిన శ్యాంప్రసాద్ ముఖర్జీ మచ్చలేని నేతగా చరిత్ర పుటల్లో నిలిచిపోయారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాళ్ళా సురేష్ అన్నారు. ముఖర్జీ చిత్రపటానికి పార్టీ నాయకులు దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, దారా మాధవరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



తిరువూరు: ఇంజినీరింగ్ చదివే పేద విద్యార్థికి తిరువూరు నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కందుల విజయకుమార్ శనివారం ఆర్థిక సాయం అందజేశారు. తిరువూరు మండలం సూరవరానికి చెందిన శివసాయిరాం ఇంజినీరింగ్ కోర్సులో ఫీజుల చెల్లింపు నిమిత్తం తన వంతు ఆర్థికసాయాన్ని విజయకుమార్ అందజేశారని సంఘ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ముసునూరు: మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా తయారు చేసి రుచిగా పిల్లలకు అందించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు ఆదేశించారు. గోపవరం హైస్కూల్లో శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణా రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ఆగిరిపల్లి: విద్యార్థుల ఆలోచన విధానంలో, ప్రవర్తనలో మార్పు తీసుకురాగల శక్తి ఉపాధ్యాయులకే ఉందని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. తోటపల్లి హీల్ పాఠశాలలో ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలను తొలగించి విద్యార్థులను అత్యున్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మానవత సంస్థ పశ్చిమ గోదావరి జిల్లా ఎడ్యుకేషనల్ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, హీల్ సంస్థ కార్యదర్శి తాతినేని లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

నూజివీడు: పట్టణంలోని బెత్స్థ ఇంటిగ్రేటెడ్ సీబీఎస్సీ స్కూల్ (బిస్)లో శనివారం గ్రాండ్ పేరెంట్స్డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్కు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ బండి మెలోడీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బిస్ పాఠశాల కరస్పాండెంట్ బండి శ్యామ్, టీచర్స్ లావణ్య, మల్లిక, సెలీనా, క్రీస్తు కుమారి, శివకుమారి, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

ఎ.కొండూరు: చీమలపాడు గ్రామానికి చెందిన కొంగల రవికుమార్ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని సీపీఎం నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. సీపీఎం నాయకుడు పి. ఆనందరావు మాట్లాడుతూ మృతుడు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని, డయాలసిస్ చేయించుకుంటూ మృతి చెందాడని చెప్పారు. మృతునికి వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులు రూ. 8 లక్షలు ఖర్చు చేశారని, అయినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎ. అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో స్వామివార్లకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను సోమవారం ఉదయం 10 గంటలకు లెక్కిస్తామని ఆలయ ఈఓ వై. సీతారామయ్య శనివారం తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో, రెవెన్యూ, పోలీస్ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో హుండీ కానుకలు లెక్కిస్తామని చెప్పారు.

పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్త వహించండి



నూజివీడులో కుక్కకు యాంటీ రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్



గుంటుపల్లిలో వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ రాధాకృష్ణమూర్తి

నూజివీడు: పెంపుడు జంతువుల పట్ల యజమానులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ నూజివీడు ఉప సంచాలకులు డాక్టర్ కె. చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే ను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పశువుల ఆస్పత్రి ప్రాంగణంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులను పెంచుకునే యజమానులు వాటి ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలన్నారు. పెంపుడు జంతువులను పెంచుకోవడం నేటి సమాజంలో అభిరుచిగా మారిందని చెప్పారు. వేలాది రూపాయలు వెచ్చించి వాటిని కొనుగోలు చేయగానే సరిపోదని, వాటికి నిరంతరం వైద్య పరీక్షలు చేయించడం ద్వారా వాటి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సూచించారు. పెంపుడు జంతువుల వల్ల అంటువ్యాధులు ప్రబలుతాయని, అవి వ్యాప్తి చెందకుండా సమీపంలోని పశు వైద్యాధికారులను సంప్రదించి ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని చెప్పారు. ముఖ్యంగా ఇంట్లో పెంచుకునే కుక్కల నుంచి రేబీస్ వ్యాప్తి చెందుతుందని, ఈ వ్యాధి రాకుండా కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. కుక్కలు కరిచినప్పుడు గాయాన్ని శుభ్రంగా మంచినీటితో కడగాలన్నారు. గాయాన్ని బ్యాండేజీలతో మూయకూడదని, వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. జూనోసిస్ డేను పురస్కరించుకుని మొత్తం 386 పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో పశువుల ఆస్పత్రి ఏడీ డాక్టర్ ఎన్. రమణారావు, పశువైద్యులు కె. అభిలాష్, శశివర్మ, సీహెచ్ హనుమంతరావు, కె. శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

- గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా గుంటుపల్లి పశుసంవర్ధక శాఖ వైద్యశాలలో పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం శనివారం జరిగింది. నందిగామ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రాధాకృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పెంపుడు జంతువులతో వ్యాధులు పొంచి ఉంటాయన్నారు. వ్యాధుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. సకాలంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి బి.కవిత, లైవ్స్టాక్ అసిస్టెంట్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.
- గంపలగూడెం: జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని మూడు పశు వైద్యశాలల్లో శనివారం 72 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. వైద్యులు అభిలాష్, సాయికృష్ణ, శిరీషల పర్యవేక్షణలో సిబ్బంది గంపలగూడెం పశువైద్యశాలలో 30 కుక్కలకు, ఊటుకూరులో 20 కుక్కలకు, నెమలిలో 22 కుక్కలకు య్యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. పెంపుడు కుక్కల విషయంలో యజమానులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు.
- ఆగిరిపల్లి: స్థానిక పశు వైద్యశాలలో 70 వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశామని పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి హనుమంతరావు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్సీ వైద్యాధికారి జగన్మోహన్రావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ప్రధానోపాధ్యాయిని పుష్పలత పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని ఉపాధి కూలీల ధర్నా



ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు, నాయకులు

ఎ.కొండూరు: ఉపాధి హామీ కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పి. ఆనందరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఆనందరావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు చేసిన పనులకు ఏడు వారాల నుంచి కూలీ సొమ్ములు రావడం లేదన్నారు. కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక ఉపాధి కూలీలు ఇండ్ల వద్దనే ఉంటున్నారని, వారికి వెంటనే పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక సూపరింటెండెంట్కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి ఎ. అమ్మిరెడ్డి, భూక్య జమలమ్మ, సోనికి, ఎస్. ఆనందరావు, గోపి, కృష్ణవేణి, మరియమ్మ పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన



సంపూర్ణత అభియాన్ ర్యాలీలో పాల్గొన్న అధికారులు, గర్భిణులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్లో గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యంపై శనివారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. సామాజిక అభివృద్ధిలో భాగంగా గర్భిణులు ఏఎన్సీ సేవలు పొందడం, వారికి సప్లిమెంటరీ న్యూట్రిషన్, మృతికా పరీక్షల గురించి వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమ పరిశీలకులుగా నీతిఆయోగ్ సలహాదారు పి. సారధిరెడ్డి, పలువురు అధికారులు పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు.

జీవన ఎరువుల పంపిణీ



రైతులకు అశ్వగంధ మొక్కలు, ఎరువులను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

నూజివీడు: అశ్వగంధ సాగు విస్తీర్ణం పెంపులో భాగంగా ఎస్సీ రైతుల్లో అవగాహన పెంచడంతో పాటు అశ్వగంధ మొక్కలను, ఎరువులను, జీవన ఎరువులను రైతులకు అందజేస్తున్నామని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త డి. అపర్ణ అన్నారు. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో అఖిల భారత ఔషధ సుగంధ మొక్కలు, తమల పాకు సమన్వయ పథకంలో భాగంగా ఎస్సీ సబ్ ప్లాన్ నుంచి ఎంపిక చేసిన ఎస్సీ రైతులకు ఈ పథకం లబ్ధిని అందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా నూజివీడు మండలం హనుమంతులగూడెంలో రైతులకు శనివారం అశ్వగంధ మొక్కలు, ఎరువులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు టి. నాగలక్ష్మి, పి. సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న మృత్యుంజయరావు, సుధాకర్

ఆగిరిపల్లి: విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని తహసీల్దార్ మృత్యుంజయరావు అన్నారు. అమ్మవారిగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మేఘా గ్యాస్ హెచ్ఆర్ బీవీ సుధాకర్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్, ఈఓపీఆర్డీ శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజనాదేవి, ఉపాధ్యాయుడు వంశీ వశిష్ట పాల్గొన్నారు.